# మళ్ళీ వసంతం

-తాటికోల పద్మావతి

అర్జునరావుకి వాగ్ధాటి ఎక్కువ. మహాభారతంలో అర్జునుడు బాణాలను సంధించినట్లు ఈ అర్జునరావు ఈటెల్లాంటి మాటలతో పొడుస్తాడు. తెల్లవారి లేచింది మొదలు నేను ఉద్యోగస్తుడిని అన్నట్లు ఆఫీసుకి వెళ్ళి తిరిగి వచ్చేదాకా ఏకధాటిగా మాట్లాడుతూనే ఉంటాడు. ఇంట బయట అర్జునరావుతో మాట్లాడాలంటే అందరికీ భయమే.

ఏమేవ్! ఎక్కడున్నావ్! స్నానానికి నీళ్ళు తోడావా! టవల్, సోప్ పెట్టావా? నేను స్నానం చేసి వచ్చేలోగా టిఫిన్ రెడీ అంటూ బాత్‌రూంలో దూరాడు. అబ్బ నీళ్ళు ఇంత వేడిగా ఉన్నాయి. సుభద్రా కాస్త చన్నీళ్ళు తీసుకురా..

భర్త పెట్టే కేకలు వింటూ సుభద్ర బకెట్టుతో చన్నీళ్ళు తీసుకెళ్ళి పోసింది. నీళ్ళు తెమ్మనగానే తెచ్చి గుమ్మరించటమేనా! ఇంత చల్లగా పోసుకుంటే జలుబు చేస్తుంది. మందుల కోసం డాక్టర్ల దగ్గరికి పరిగెత్తాలి. "నీ బాబేమన్నా డబ్బుల మూట పంపిస్తాడా? నా దగ్గర ఖర్చుపెట్టటానికి ఇక్కడేం చెట్టుకి కాయటంలా...

ఇంకా ఏం పెడతాడులేండి మా నాన్న! ఇప్పటిదాకా పెట్టింది చాలు. ఎప్పుడూ మా నాన్న సొమ్ము కోసం ఆశపడకపోతే మీరు కష్టపడి సంపాదిస్తున్నారుగా మా నాన్నకేమన్నా పెడుతున్నారా. మాటకి మాట చురక అంటించింది సుభద్ర.

స్నానం చేసి డ్రస్ చేసుకుని టేబులు ముందు కూర్చోగానే ప్లేటులో పెట్టిన వేడివేడి ఉప్మా చూసి, ఇది తప్ప నీకేం దొరకలేదా. తొందరగా అయిపోతుందని ఇంత ఉడకేసి నా మొహాన పడేయపోతే ఉల్లి, అల్లం వేసి పెసరట్లో, మినపట్లో చేసి తగలడచ్చుగా..

ఈ రోజు శనివారం అన్న సంగతి మరచిపోయారా. పిల్లలిద్దరూ స్కూలుకి తొందరగా వెళ్ళాలి. వాళ్ళని రెడీచేస్తూ పెనం మీద ఒక్కొక్క దోసె పోస్తూ కూర్చుంటే టైమెక్కడ సరిపోతుంది. ఈ రోజు ఉప్మాతో సరిపెట్టుకోండి.

"అంతేలే సరిపెట్టుకోక ఛస్తానా! ఇంకేం పిల్లలూ, నేను వెళ్ళిపోయాకా నీకంతా ఖాళీనే గదా. ఆ టీవీ ముందు సీరియల్స్ చూస్తుండు. ఉద్యోగమా, సద్యోగమా? ఏముందీ. ఇంతకీ బాక్స్‌లోకి ఏం చేశావ్. తొందరగా అయిపోతుందని ఆ వంకాయ కూరేనా?"

లేదు లెండి ఈ రోజు కాకర వేపుడు చేసి ఉల్లి కారం పెట్టాను. ఇంతంత నూనెలు పోసి వేపుళ్ళు చేయకపోతే పులుసు బెల్లంపెట్టి వండచ్చుగదా నీ సొమ్మేం పోయింది. నేను తెచ్చి పడేసేవాడ్ని వున్నానుగా అంటూ బాక్స్ తీసుకొన్నాడు అర్జునరావు.

సాయంత్రం వచ్చేటప్పుడు చేతులు ఊపుకొంటూ రాకుండా మల్లెపూలు తీసుకురండి, మరచిపోవద్దు.

నాకు గుర్తుంటే తెస్తాను. పూలు, పళ్ళు తేవటానికి సంచులు పట్టుకెళ్ళటంలేదు. ఆ బరువులన్నీ ఎవరు మోస్తారు. వాకిలి ముందు వస్తే తీసుకో.

ఇందాకటి నుంచీ చూస్తున్నాను. ఏమిటి మీరు? ఎవరో బయటివాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడుతున్నారు. మీకేగాదు మాట్లాడటం నాకూ వచ్చు మాటలు-పూలు మీ చేతులతో మీరు తెస్తే బాగుంటుందని అడిగాను. నేనేం కొనుక్కోలేక కాదు. మగవాడు బయటికి వెళితే వచ్చేటపుడు పూలు, పండ్లు తేవటం సహజం. ఏనాడు

## ఐదు హైకూలు

కడుపు నిండా
పాలు ఇచ్చింది అమ్మ
పవ్వళించెగా.

బాలకృష్ణుని
చేష్టలా అవి నోట
బొటన వ్రేలు!

పాట నవ్వింది
ఉయ్యాలలో నిండుగా
దేముని చూసా!

ధన్యవాదాలు
దోసిలితో పోయాలి
దేముడా నీకు!

శైశవ క్రీడలు
చిరకాల స్మృతులుగా
మనసునే పదిలం.

-శ్రీమాన్ శ్రీకాశ్యప

తెచ్చారు గనుక, నేను చెప్పటం దండగ. మూతి మూడు వంకర్లు తిప్పింది సుభద్ర.

తిప్పావులే మూతి ముప్పైసార్లు. మాటకి ముందు అలగటం– మీ ఆడవాళ్ళకి చేతనైంది అదేగా. బాక్స్ తీసుకొని బయలుదేరాడు అర్జునరావు.

సుభద్రకి భర్త మీద చాలా కోపం వచ్చింది. ఎప్పుడూ ఈయన ఇంతే. ఎప్పటికి మారతారో ఏమో అనుకొంది.

సాయంత్రం అర్జునరావు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి కాఫీ తాగి కాలక్షేపం కోసం టీవీ ముందు కూర్చు న్నాడు. ఈలోగా సుభద్ర పిల్లలిద్దరికీ స్కూల్ వర్క్ చేయించి అన్నం తినిపించి నిద్రబుచ్చింది. కంచంలో అన్నం వడ్డించి భర్తని కేకేసింది.

కూరన్నం కలుపుకొని నోట్లో పెట్టుకున్నాడు. అబ్బా! గొడ్డుకారం. నోరు మండిపోతున్నది. ఇంతింత కారాలు పోసి నాకు బిపి తెప్పించేటట్లున్నావు. గ్యాసుట్రబుల్. గొంతులో మంట అంటూ కూరన్నం తీసి పక్కన పడే శాడు. చారన్నం రుచి చూసి ఇందులో పులుపెక్కువ. ఆ మజ్జిగ ఇలా పొయ్యి నా మొహాన అంటూ మజ్జి గన్నం తిని లేచాడు.

సుభద్రకి కూరలో కారం లేదు. చారు చప్పగా ఉన్నాయి. అయినా ఈయనెందుకిలా ప్రవర్తిస్తారో అర్థం కావటంలేదు.

ప్రతిరోజూ ఏదో వంకపెట్టి సుభద్రని మాటలతో చంపుకుతింటాడు. ఇద్దరి మధ్యా అన్యోన్యత కరువైంది. తెల్లవారి లేచింది మొదలు కీచులాట ప్రారంభం. ఇలా నసపెడుతుంటే నేనీ ఇంట్లో వుండను, పుట్టింటికి వెళ్లిపోతానంది సుభద్ర.

పోతే పో, ఎవర్ని బెదిరిస్తావు. పొయ్యేదానివి పిల్లల్ని కూడా తీసుకెళ్ళు. నాకెందుకు జంఝాటం. హాయిగా హోటల్లో తిని కాలం గడిపేస్తానన్నాడు.

మీకేం మీరు హాయిగా వుంటే చాలు. భార్యా, పిల్లలు ఏమైపోతే మీకేంటి? ఈ రోజు నుంచి మీరు నాతో మాట్లాడకండి. అన్నీ టేబుల్ మీద పెడతాను. మీరే వడ్డించుకొని తినండి.

సుభద్ర మూతి ముడుచుకొని అలిగింది. ఎప్పటి లాగా అవి ఇవీ కావాలని అడగటంలేదు అర్జునరావు.

నాలుగు రోజులు ఓపిక పట్టాడు. పడకలు వేరవ టంతో నిద్రపట్టక అర్ధరాత్రి దాకా టీవీతో కాలక్షేపం చేసేవాడు.

వారం గడిచింది. సుభద్ర మంచం మీద హాయిగా పడుకొంది. తల్లో మల్లెలు గుప్పున గుబాళిస్తున్నాయి. నిగ్రహించుకోలేకపోయాడు. ఆమె మంచం మీద చేరి ముఖంపై ముంగురులు సవరించి బుగ్గపై ముద్దుల వర్షం కురిపించేసరికి సుభద్రలో ఉన్న కోపాలు తాపాలు మాయమైనాయి. అన్నీ మరచిపోయి భర్త సాంగత్యంలో కరిగిపోయింది.

నాలుగు రోజుల తర్వాత తిరిగి జగడాలు ప్రారం భం. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. ఎవరికి వాళ్ళే పోనీలే అని సర్దుకొంటున్నారు. చదువులు, ఉద్యోగాలు పెళ్ళిళ్ళు. బాధ్యత తీరింది అర్జునరావుకి.

ఆఫీసు వాళ్ళు ఇక నీతో పనిలేదంటూ రిటైర్ చేసి సన్మానంతో పాటు శాలువా కప్పారు. పెన్షన్‌తో ఇల్లు గడిచిపోతున్నది. వచ్చిన డబ్బులు బ్యాంకులో వేశాడు.

ఇంట్లో ఉంటే బోర్‌గా ఉంటుందని సాయంత్రం కాగానే లైబ్రరీకో లేదా పార్కుకో వెళ్ళి అక్కడ కనిపించిన స్నేహితులతో బాతాఖానీ కొట్టి రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వస్తాడు.

వంటరిగా సుభద్ర ఏ రామాయణమో, భారతమో చదువుకొంటుంది. ఉదయం వంట పనికి హడావిడి లేదు. పిల్లలిద్దరూ పెళ్ళి చేసుకొని వెళ్ళారు. కూతురి దగ్గరికి వెళ్ళాలనుకొంది. షిరిడీ వెళ్తున్నాం రమ్మని వ్రాసింది. ఆయన గుళ్ళూ గోపురాలకు రారు. సుభద్ర ఒక్కతే వెళ్ళాలనుకొంది. వయసు వచ్చాక వంటరితనం భరించాలంటే చాలా కష్టం. పొద్దు గడవదు. ఇద్దరు మనుషులకి ఏం పని ఉంటుంది. ఎక్కువ సమయం ఖాళీయే. అర్జునరావు నోటికి తాళం పడింది. ఇదివరకులా ఎక్కువ వాగ్వాటి లేదు.

శనివారం గదా అని సుభద్ర గుడికి బయలు దేరింది. అర్జునరావు పేపర్ చూస్తూ కూర్చున్నాడు. ఏమండీ గుడికి వెళ్ళొస్తాను, ఇల్లు జాగ్రత్త. తల వంచుకొని పేపర్‌లో లీనమైనారంటే ఏ దొంగాడో వచ్చి దూరగలడు అంటూ భర్త జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్ళింది.

ఈ ఆడవాళ్ళు ఇంతే! భర్త రిటైరై ఇంట్లో ఉంటే ఎందుకూ పనికిరాని వాడి క్రింద జమకడతారు. ఇద్దరం కలిసే వెళితే సొమ్మేం పోయింది. ఒక్కడినే ఇంటికి కాపలా కాయాలి. ఏం చేస్తాం ఖర్మ అనుకొన్నాడు.

ఏడింటికి వెళ్లిన సుభద్ర పది గంటలు దాటాక వచ్చింది. రెండోసారి కాఫీ పడలేదు. కడుపులో నకనక లాడుతున్నది. టిఫిన్ పడలేదు. భర్తంటే ఇంత నిర్ల క్ష్యమా? రానీ చెబుతానంటూ పళ్ళు నూరాడు.

ఇదిగో ప్రసాదం అంటూ కొబ్బరి ముక్క చేతిలో పెట్టింది సుభద్ర. ఈ ప్రసాదంతో ఏం కడుపు నిండుతుంది. త్వరగా టిఫిన్ చెయ్యి ఆకలి దంచేస్తున్నది. గుడికి వెళ్ళినదానివి ఇపుడా రావడం. ఇంట్లో భర్త అనే వాడొకడున్నాడని ఇంగిత జ్ఞానమైనా లేకుండా నీ మటుకు నువెళ్ళావు. నన్ను కూడా రమ్మనచ్చుగా. టింగురంగామంటూ ఒక్కదానివే వెళ్ళకపోతే! నిన్నని ఏం లాభంలే! ఇవి నీ రోజులు. ఆఫీసుకు వెళ్ళేటపుడు వేళకు అన్నీ అమర్చిపెట్టేదానివి. ఇపుడు ప్రతిదానికి నిన్ను అడగాలి. రిటైరై ఇంట్లో పడి ఉండేవాడికి సేవలు చేసేదేమిటిలే. ఎప్పుడో ఒకప్పుడు వండి పడేస్తే పోతుందిలే అనుకొన్నావు.

మీకు గుళ్ళూ గోపురాలంటే ఇష్టం ఉండవుగా. అందుకే మిమ్మల్ని పిలవను. అపుడంటే ఆఫీసు, బాధ్యతలు. క్షణం తీరికుండదు. ఇపుడంతా ఖాళీనే గదా. ఎక్కడో ఒకచోటికి వెళ్తుంటేనే కదా కాలక్షేపం అయ్యేది.

మొన్నీ మధ్య కూతురు అల్లుడితో కలిసి తిరుపతి వెళ్ళివచ్చావు. కొడుకు దగ్గరికి వెళ్ళినపుడు హైదరాబాదంతా చుట్టబెట్టావు. ఇంట్లో ఎవరో ఒకరు కాపలా ఉండాలంటూ నన్ను ఉంచి వెళ్ళావు. ఇద్దరం కలిసి వెళ్తే బాగుంటుందని ఎప్పుడైనా అనుకొన్నావా? నేనంటే అసలు లెక్కలేకుండా పోయింది. రేపు షిరిడీ వెళ్ళేటపుడు నాకూ టిక్కెట్లు బుక్‌చేయించు. అంత దూరం ప్రయాణం చేయలేదని ఏదో ఒక అడ్డుపుల్ల వేయకు. ఈసారి నేను తప్పకుండా వస్తానన్నాడు.

ఈరోజు మిమ్మల్ని గుడికి తీసుకెళ్ళలేదని ఇంతగా బాధపడుతున్నారు. మీరు ఆఫీసుకు వెళ్ళే రోజులు ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. మీరు బయటికి వెళ్ళినపుడు నేను వంటరిగా ఎలా ఉండేదాన్ని. ఒకసారి సినిమాకి వెళదామంటే పక్కింటి పిన్నిగారితో వెళ్ళమన్నారు. ఆదివారం సరదాగా బయటికి వెళదామంటే డబ్బులు ఖర్చవుతాయని మీరొక్కరే వెళ్ళేవారు. ఒక సరదా లేదు, సినిమా లేదు. పిల్లలు పెద్దయినాక తీరుబడే లేదు. ఇప్పుడే బాధ్యతలు లేవు. అందుకే వెళ్తున్నాను. ఈ కాస్త ఓపిక తగ్గిపోతే ఎక్కడికీ వెళ్ళలేను. మీరు వస్తానంటే నేనేమీ మీలాగా కాదంటానను కొంటారా?

గడియారం పది గంటలు కొట్టింది. త్వరగా వంట చేయాలంటూ సుభద్ర లోపలికి వెళ్లింది.

అర్జునరావు ఆలోచనలతో మంచం మీద వాలిపోయాడు. నిజమే! సుభద్ర అన్నదాంట్లో తప్పేం లేదు. భార్యతో కలిసి తిరగవలసిన సరదాలన్నీ దూరం చేసుకొన్నాడు. ఆఫీసు టైముకి అన్నీ అమర్చిపెట్టినా ఇంకా అది ఇవ్వలేదు. ఇది ఇవ్వలేదంటూ సణిగేవాడు. పాపం సుభద్ర ఎంతగానో బాధపడేది. నేనే ఉద్యోగం చేస్తున్నాను, నీకేం ఆడదానివి. తిని ఇంట్లో కూర్చుంటావంటూ దెప్పిపొడిచేవాడు. ఆ వంటరితనం వాళ్లకెంత నరకమో తెలియలేదు. చీటికి మాటికి విసుక్కొంటే ఏ భార్యకి మాత్రం ఒకపుడు కాకపోయినా ఒకపుడు కోపం రాకపోతుందా. అర్జునరావుకి ఇప్పుడు తెలిసింది ఆ బాధేమిటో!

వంట పూర్తిచేసి భర్తని భోజనానికి పిలవటానికి వచ్చింది సుభద్ర. ముసుగు తన్ని పడుకొన్నాడు అర్జున

## ఒక ప్రశ్న.. అటు ఇటు

స్తబ్దత.. నిరుత్సాహం సర్వాంతరమై
అంచనా... అనుమానం సర్వజనికమైనపుడు
కరువు కోరల ముంగిట
రుతుపవన మందగమనం...
ఒక వర్షం... కుంభవృష్టిల మమేకాన
పగుళ్ళు బిగించిన చెరువుల కుంటలు
దాహార్తికి దారులు తీస్తున్నప్పుడు
అంచనాల వెల్లువన ఆశల సంబరం
పొంగే వాగుల ఉరకల సాక్షిగా
సేద్యతలాన్ని హర్షాతిరేకమంటుంది.
హర్షాతిశయపు అంగట్లోని
ముసురు ముప్పు వర్ష బీభత్సం
రుతుక్రమానికి చీకటి చిత్రాన్ని లిఖిస్తూంటే
విధానం విచక్షణ లేమి
వరద ముప్పేటన చెరువుకు చేరువంటోంది.
ప్రమోదం అన్న ప్రకృతి వర్షం
బీభత్స కెరటానికి వత్తాసు పలికితే
పోకడల మాధ్యమాన పరిరక్షణ
పట్టణ పట్టికలోని పర్యావరణం
సజీవానికి మరణ గీతికను రచిస్తున్నాయి.
ఉరిమే ఉరుమూ... మెరిసే మెరుపు
చెరువు కుంటల్ని వెక్కిరిస్తూంటే
హైటెక్కు ముసుగులోని మౌలిక ప్రశ్న
ప్రకృతి సమతుల్యానికి అర్థంకాని సమాధాన
మవుతోంది.

-వడలి రాధాకృష్ణ

రావు.

వంటయింది భోజనానికి రండంటూ పిలిచింది. ఉలుకూ లేదు, పలుకూ లేదు. ఏమండీ మిమ్మల్నే పిలిచేది! ఆలస్యం చేశానని తిట్టుకొంటారు. ఎటువంటి కదలిక లేదు.

ఈరోజు శనివారం గదా అని మీకిష్టమైన పెరుగు ఆవడలు, పులిహోర, చక్రపొంగలి చేశాను. ముల క్కాడల పులుసు, కాకరకాయల వేపుడు, దోసకాయ పచ్చడి అన్నీ మీకిష్టమైనవే! నాకు చాలా ఆకలి వేస్తున్నది. త్వరగా రండి భోజనం చేద్దాం.

నిజంగానే నిద్రపోతున్నారా ఏమిటి. దుప్పటి తీసి చూసింది. భర్త కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి. ఒక్కసారిగా చలించిపోయింది. ఏమిటండీ చిన్నపిల్లాడిలా ఆ కన్నీళ్లేమిటి. ఇప్పుడేమైందని బాధపడుతున్నారు. ఆరోగ్యం బాగాలేదా? ఆస్పత్రికి తీసుకెళ్లమంటారా? శరీరం తాకి చూసింది. చల్లగానే ఉంది. మరి కాస్త చొరవచేసి రెండు చెంపలు నిమిరి ముఖం తనవైపుకి తిప్పుకొంది.

భార్య చేతి స్పర్శ తగలగానే ఒక్కసారిగా ప్రేమ ఉప్పొంగింది. శారీరకంగా ఇద్దరి మధ్యా దూరం పెరిగి చాలాకాలం అయింది. పిల్లలకు పెళ్ళిళ్ళయి దూరంగా ఉంటున్నారు. ఇంతకాలం బాధ్యతలు, బంధాలతో సరిపోయింది. తెల్లవారి లేచినప్పటి నుంచి ఇంటి పనులతో సతమతమయ్యేది సుభద్ర. ఆఫీసు పనులతో ఊపిరి సలపని అర్జునరావు సుభద్రని అంతగా పట్టించుకోలేదు.

భార్య చేతుల్ని తన గుండెల కానించుకొన్నాడు. ఇలాగే శాశ్వతంగా ఉంటే బాగుంటుందనిపించింది. భార్య తోడు నీడ లేని జీవితం వ్యర్థం. ఎన్ని సిరిసంపద లున్నా భార్యా భర్తల్లో ఏ ఒకరు దూరమైనా ఆ బ్రతుకే వ్యర్థం.

సుభద్రా ఇన్నాళ్ళూ నిన్ను కష్టపెట్టాను. భర్త అనే అధికారం చెలాయించి నిన్ను చాలా కష్టపెట్టాను. ఇల్లే బందిఖానా చేసి నిన్నెపుడూ బయటికి తీసికెళ్ళలేదు. ఇంటి పనులతో అలసిపోయిన నిన్ను అక్కున చేర్చుకొని ఓదార్చలేదు. పండంటి బిడ్డల్ని అందించావు. నీలాంటి భార్య దొరకటం నిజంగా నా అదృష్టం. నన్ను క్షమిస్తావు కదూ. నే చేసిన తప్పేమిటో తెలుసుకొన్నాను. నీ సహచర్యం నాకెపుడూ కావాలంటూ సుభద్రను మరింతగా దగ్గరికి తీసుకునే సరికి గుండెలకు మరింతగా హత్తుకుపోయింది.

అర్జునరావు మంచం మీది నుంచి లేచాడు. సుభద్ర ఇద్దరికీ వడ్డించింది. ఆరోజు భార్య చేతి వంట చాలా రుచిగా ఉంది. కడుపునిండా తిన్నాడు.

రాత్రికి గదిలో మంచం మీద పడుకొన్న అర్జునరావుకి ఆకాశంలో చందమామ మరింత అందంగా కన్పించింది. పున్నమి వెన్నెల పిండారబోసినట్లుంది. కిటికీ పక్కనే ఉన్న నైట్ క్వీన్ చెట్టంతా తెల్లగా విచ్చుకొన్న పూలు గుత్తులు గుత్తులుగా మత్తుగా సువాసనలు వెదజల్లుతున్నాయి. సుభద్ర తెల్లని జరీలో, తలనిండా మల్లెపూలతో గదిలోకి అడుగుపెట్టి భర్త పాదాలను సున్నితంగా వత్తుతుంటే, అరవైలో ఇరవైలా చైత్రంలో వసంతం వచ్చినట్లు అర్జునరావు మనసు కొత్త కోర్కెల చిగుళ్ళు తొడిగి కోయిల రాగంలా పులకింతలతో తొలి రాత్రి మధుర క్షణాలు మదిలో మెదిలాయి.

సుభద్రా ఈ క్షణం నుంచీ చివరి క్షణం దాకా నీ తోడు నాకు కావాలంటూ భార్యని దగ్గరికి తీసుకొన్నాడు. సుభద్ర చిన్నపిల్లలా భర్త కౌగిట్లో ఒదిగిపోయింది. తొలిరాత్రి మధుర క్షణాలు ఇద్దరినీ మరో లోకానికి తీసుకువెళ్లాయి. వారి అన్యోన్యం ఇలాగే కొనసాగాలంటూ మబ్బుల్లో చంద్రుడు ముసిముసిగా నవ్వుకొన్నాడు. ఆ రాత్రి వెన్నెల మరింత చల్లగా ఉంది. అర్జునరావుకి మళ్లీ వసంతం వచ్చింది. ■

## చినుకు తడిలో..

హృదయాన్ని గులాబీని చేసి
తెల్లని మేఘానికి అలంకరించాలి
పలకరింపుతో పరవశించి
చినుకులను అక్షరాల రూపంలో ఆస్వాదించాలి.
ఒక గీతం
లోపల ఊపిరి పోసుకుంటున్నపుడు-
నల్లని మబ్బుల అంచులని తాకి
రెక్కలు కట్టుకుని విహరిస్తున్న చల్లని గాలిని
పలుకరించాలి.
నీటి చుక్కల గుబాళింపు
వెల్లి విరిసే హరివిల్లు సౌరభాలను
మోసుకొస్తుంది.
వర్షానికి హర్షం ప్రకటించి
కవితా పుష్పాల కోసం
వెదకడం ప్రారంభిస్తాను.

-పబ్బతి సరళ